క్లుప్తంగా

ఘనంగా దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి సహస్ర లిల్లీ పుష్ప పూజ



స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి పూజల్లో పాల్గొన్న మహారాష్ట్ర భక్తులు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారికి సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఐదో రోజు గురువారం సహస్ర లిల్లీ పుష్ప పూజ నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి పాదగయ క్షేత్రంలో సప్తాహ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతుండగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు మహారాష్ట్ర భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

ఆక్రమణదారులకు నోటీసులు



ఆక్రమణదారులకు నోటీసు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి కుమార్, రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదులో కొందరు పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. దీనిపై గురువారం పంచాయతీ స్థలం ఆక్రమణ శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. దీనిపై స్పందించిన అధికారులు బొడ్డు సూర్యలక్ష్మికి నోటీసులు ఇచ్చారు. నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆదేశించినట్లు పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ కుమార్ తెలిపారు.

పఠన, రాత నైపుణ్యాలు మెరుగుపడాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ శివ రామకృష్ణయ్య

సామర్లకోట: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల పఠన, రాత నైపుణ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పంతం పద్మనాభం ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ మేరకు ప్రతి విద్యార్థి వర్కుబుక్ కరెక్షన్స్, పాఠ్య పుస్తకాల సిలబస్‌ను పరిశీలించారు. పాఠశాలలో ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లిషులోని అంశాలను స్పష్టంగా చదడం, రాయడంపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి గణితంలో ముఖ్యమైన కూడిక, తీసివేత, గుణకారం, భాగహారాలను నేర్చుకోవాలన్నారు. వాటిలో వెనుకబడిన విద్యార్థులకు ఉదయం ప్రత్యేకంగా ఒక తరగతి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూచి, విద్యార్థులకు వడ్డించి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రతి రోజు మెనో ప్రకారం భోజనం ఉండాలని ఎంఈఓ ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంగా గీత పరామర్శ



కొత్తమూలపేటలో రాయుడు సత్తిబాబును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గీత

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను గురువారం మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత పరామర్శించారు. కొత్త మూలపేటకు గ్రామానికి చెందిన ఎంపీటీసీ రాయుడు సత్తిబాబు తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఉప్పాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కోటి బాబ్జి, వాసంశెట్టి సాయి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కరే శ్రీనివాస్, రావు చిన్నారావు, ఉమ్మిడి జాన్, జ్యోతుల బాబులు, కారే కిరణ్, వడ్డి నాగమణి, మాతా కుమార్ తదితరులు ఉన్నారు.



ఓ అపార్ట్‌మెంట్ వద్ద లీకవుతున్న మంచినీటి పంపు



ఎన్‌టీఆర్ కానీలలో డస్ట్‌బిన్ వద్ద సంచరిస్తున్న పందులు



ఓ అపార్ట్‌మెంట్ పైప్‌లైన్ల నుంచి లీకవుతున్న తాగునీరు



ఎన్‌టీఆర్ కాలనీకి వెళ్లే జగ్గంపేట ప్రధాన రహదారి దుస్థితి ఇది

సమస్యలతో సహజీవనం

- ఎన్‌టీఆర్ కాలనీవాసుల కష్టాలు
- శిథిలావస్థలో అపార్ట్‌మెంట్లు
- పగిలిపోయిన తాగునీటి పైప్‌లైన్లు
- క్షీణించిన పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు



పెద్దాపురం ఎన్‌టీఆర్ కాలనీ ముఖద్వారం

పెద్దాపురం: స్థానిక జగ్గంపేట రహదారిలోని ఎన్‌టీఆర్ కాలనీలో సమస్యలు తాండవమాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వస్తే తమకు అన్ని వసుతులు వచ్చేస్తాయనుకున్న కాలనీ వాసులకు ఏ ఒక్క సమస్యా పరిష్కారమైన దాఖలాల్లేవు. పత్రికల్లో కథనాలు వచ్చిన రెండు రోజుల పాటు పారిశుధ్య పనులు చేసినా మళ్లీ నెల్లాళ్లుగా ఆ వైపు చూడలేదని కాలనీవాసులు వాపోతున్నారు. క్షీణించిన పారిశుధ్యం, తాగునీటి పైప్‌లైన్ల లీకులతో పాటు, అపార్ట్‌మెంట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

కాలనీకి చేరుకోవాలన్నా నరకమే..

స్థానిక నవోదయ విద్యాలయ నుంచి కట్టమూరు జంక్షన్ వరకు రహదారి గోతులతో ఉండడంతో పట్టణ శివారులో కాలనీకి చేరుకోవాలంటూ వాహనదారులు, కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పెద్దాపురం–జగ్గంపేట ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రహదారి నిర్మించకపోవడంతో పట్టణ వసులు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

నిత్యం నీటి వృథా..

కాలనీలోని అపార్ట్‌మెంట్లలో ఎక్కడికక్కడే వాటర్ ట్యాంకులు లీకవడంతో కాలనీలో నీరు వృథాపోతోంది. ఉదయం ఏడు గంటలకు మున్సిపల్ వాటర్ పంపిణీ చేసేటప్పటికి ప్రతి ఆపార్ట్‌మెంట్‌లో ఏదో ఒక బ్లాక్ వద్ద పైపులైన్లు పగలడంతో తాగునీరు మురుగుకాలవల్లోకి చేరుతోంది తప్ప ప్రజలకు ఉపయోగపరంగా లేకపోవడంతో అక్కడి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధింత ఇంజినీరింగ్ అధికారులు మంచినీటి పైపులైన్ల లీకులపై దృష్టి సారించాల్సి ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

క్షీణించిన పారిశుధ్యం

కాలనీలో ఏ రహదారి వెంబడి వెళ్లిన చెత్తాచెదారం, కుళ్లిన ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. పందుల స్వైర విహారం, డ్రెయిన్ల పూడికతీత లేకపోవడంతో కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి వేళ అయితే వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగకపోవడంతో చీకటిలోనే ప్రజలు జీవిస్తున్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి



ఎన్‌టీఆర్ కాలనీలో సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. నిత్యం తాగునీటి సరఫరా, డ్రెయిన్ పూడిక, పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే దృష్టిపెట్టాలి.

–అక్షింతల గంగాధర్, ఎన్‌టీఆర్ కాలనీ, పెద్దాపురం

కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎన్‌టీఆర్ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం. నిత్యం పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. పైప్‌లైన్ల లీకులు, అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

జర్నలిస్టుల సంక్షేమానికి సహకరిస్తాం

వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత



బ్యాగ్‌ను ఆవిష్కరిస్తున్న వంగా గీత

పిఠాపురం: జర్నలిస్టుల సంక్షేమానికి సహకారం అందిస్తామని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. గురువారం మండలంలోని నరసింగపురం రోడ్డులో జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ పిఠాపురం ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై యూనియన్ బ్యాగ్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులకు అండగా కూటమి ప్రభుత్వ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వారు యూనియన్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం జర్నలిస్టులు ఎంతో శ్రమిస్తుంటారన్నారు. నిత్యం కుటుంబాలను కూడా వదిలి విధి నిర్వహణలో ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తారన్నారు. అటువంటి వారికి స్థానికంగా ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

క్రీస్తు జననం శుభ పరిణామం

పెద్దాపురం: క్రీస్తు జననం ప్రపంచానికి మంచి పరిణామం అని బిషప్ టి.బ్లెస్సింగ్, క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం అన్నారు. క్రిస్మస్ ఆరాధనల్లో భాగంగా మండలంలోని కాండ్రకోట క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో గురువారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో దైవసులు కె, అభిషేక్, కె.జయకుమార్ వాక్యోపదేశాలు చేశారు. చిన్నారులు ఆలపించిన క్రైస్తవ గీతాలు ఆలపించారు. పాస్టర్లు వంకా జాన్, కాసా అభిషేక్, శాంతివర్ధన విభిన్న ప్రతిభా వంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు పాల్గొన్నారు.

గ్రామాల వారీగా భూ సమస్యల పరిష్కారం



సమస్యలపై ఎమ్మెల్యేకి, ఆర్డీఓకు ఫిర్యాదులు అందజేసిన రైతులు

- ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
- గతంలో చేసిన ఫిర్యాదులను పరిష్కరించలేదన్న దరఖాస్తుదారులు
- ఉండూరు గ్రామంలో రైతుల ఆవేదన

సామర్లకోట: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండల పరిధిలో ఉండూరు గ్రామంలో గురువారం ఉండూరు, వల్లూరు, మామిళ్లదొడ్డి గ్రామాల సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో భూసర్వేలు పూర్తిచేసినట్టు తెలిపారు. గతంలో రైతులకు ఇచ్చిన పాస్ పుస్తకాలను రద్దు చేసి ప్రభుత్వ లోగోతో కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వడానికి కార్యచరణ జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో 40 గ్రామాలను రూ.20 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ ఎస్ మల్లిబాబు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలలో ఇచ్చిన ఫిర్యాదు కాకుండా కొత్త వారు మాత్రమే ఫిర్యాదులు అందజేయాలని ఆయన సూచించారు. గ్రామ దేవత నూకాలమ్మ తల్లి భూమి సుమారు 90 సెంట్లు అన్యాక్రాంతం అయిందని, దానికి రక్షణ కల్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆ గ్రామ నాయకులు కొప్పిరెడ్డి సాంబమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వీరాస్వామి ఆర్డీఓ మల్లిబాబు, ఎమ్మెల్యే రాజప్పలకు ఫిర్యాదు చేశారు.

45రోజులు గడిచినా పరిష్కారం కాని సమస్యలు..

రైతుల సమస్యల కోసం అక్టోబరు 22వ తేదీన ఉండూరు గ్రామంలో రీ సర్వే గ్రామ సభలు నిర్వహించారని ఆ సభలలో వచ్చిన భూ సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని బత్సల గంగరాజు, కొప్పిరెడ్డి రామదాసుతో పాటు అనేక మంది రైతులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విత్తనాల వెంకటరమణ, ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డి, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సీహెచ్ నరసింహమూర్తి, ఎ సంజీవ్, భరత్, టి.సాయిరాం, వీఆర్వోలు వల్లీ, కె చంద్రబాబు, ఆర్ కొండలరావులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ


మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



రైతులకు అండగా వైఎస్సార్ సీపీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగా గీత

పిఠాపురం: రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద రైతులకు అండగా వైఎస్సార్ సీపీ నిర్వహించనున్న కార్యక్రమ పోస్టర్‌ను గురువారం పిఠాపురంలో ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కృష్ణా, గుంటూరు, కాకినాడ తదితర జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గంలో రైతాంగం కష్టాలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతుల తమ ధాన్యాన్ని కళ్లాల్లోనే వదులుకోవాల్సిన దుస్థితి ఎదురైందన్నారు. ఇటీవల ఏలేరు ప్రాజెక్టు నుంచి సుమారు 6 టీఎంసీల నీరు వదలడం వల్ల పిఠాపురం నియోజకవర్గంలో వందల ఎకరాల భూములు నీట మునిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఒక ఎకరంలో 8 బస్తాలు కూడా అవ్వని దుస్థితిలో రైతులు ఉంటే వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతోందన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులను కంటికి రెప్పలా కాపాడేవారన్నారు. అధికారులను అప్రమత్తం చేసి రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల ద్వారా ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేయడం ద్వారా రైతులకు ఎటువంటి నష్టం వాటిల్ల కుండా చూసేవారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇతర రాయితీలు క్రమం తప్పకుండా అందించేవారన్నారు. ఇలాంటి పకృతి వైపరిత్యాల సమయంలో గోనె సంచులు వంటివి ఇప్పించి ఎరువులు పురుగు మందులు అన్ని అందుబాటులోకి తెచ్చి రైతులకు ఇచ్చే వారన్నారు. అలాంటిది ఇప్పుడు ప్రభుత్వం కనీసం రైతులను పట్టించుకోపోవడంతో వారికి అండగా నిలబడాలని వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఆందోళన చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంతో ఆగిపోకుండా నిత్యం రైతులకు వెన్నంటి ఉండి వారికి ఏకష్టం వచ్చినా వెన్నుదన్నుగా నిలబడతామన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు తాము నిద్రపోమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బొజ్జా రామయ్య, పచ్చిమళ్ల అప్పలరాజు, రావుల మాధవరావు, కడింశెట్టి కుమార భాస్కరరెడ్డి, జవ్వాది నాయుడు, అరిగెల రామయ్యదొర, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది



ఆవాల లక్ష్మీనారాయణ

సామర్లకోట: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని ఆ పార్టీ అయ్యారక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేసిందన్నారు. రైతుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సార్వా సీజన్‌లో రైతులకు కనీసం పెట్టుబడి సాయం కూడా అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పూర్తి గా ప్రకృతి, మార్కెట్ శక్తుల దాయా దాక్షిణ్యాలకు వదిలేసిందని విమర్శించారు. రైతు సమస్యలపై నిలదీయడానికి శుక్రవారం కాకినాడలో ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తునట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని రైతులు హాజరు కావాలన్నారు.

చేబ్రోలులో సినిమా సందడి

పిఠాపురంలో అలా మొదలైంది చిత్రం షూటింగ్ ప్రారంభం



ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొడుతున్న శ్రీనివాస్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు రామాలయంలో గురువారం సినిమా సందడి నెలకొంది. హిట్ చిత్రాల దర్శకుడు చంద్ర మహేష్ దర్శకత్వంలో దాట్ల సూర్యనారాయణ రాజు సమర్పిస్తున్న శ్రీదేవిక ప్రొడక్షన్ మహేష్ చంద్ర చిత్ర యూనిట్ ఆధ్వర్యంలో ఆకుల సురేష్ పటేల్ నిర్మాణ సారథ్యంలో నిర్మిస్తున్న చిత్రం ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశాన్ని చిత్రీకరించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి నట కిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌పై క్లాప్ కొట్టి ప్రారంభించారు. చిత్ర దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ గోదావరి జిల్లాకు చెందిన తాను ఎన్నో సినిమాలు నిర్మించి, వరుస విజయాలు పొందానన్నారు. ప్రస్తుతం సరికొత్త ప్రేమ కథతో నిర్మించబోతున్న చిత్రం చేబ్రోలు గ్రామంలో చిత్రీకరించడం ఆనందంగా ఉందన్నారు. చేబ్రోలు ప్రజల సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ గ్రామంలో నెలరోజులకు పైగా చిత్రం నిర్మాణం జరుగుతుందని, జిల్లా నటీనటులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ చిత్రంలో నటకిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ రాజ్, సీనియర్ నటి జే.వాహిని, నటుడు కేదార్ శంకర్, జబర్దస్త్ ఆర్టిస్ట్ కేపీ పాల్, బీఎస్ రాజు నూతన నటీనటులతో ఈ చిత్రం నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) మాట్లాడుతూ తాను ఏ కార్యక్రమానికి హాజరు కానని, అటువంటిది మిత్రుడు ఆకులు సురేష్ పటేల్ నిర్మిస్తున్న ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

18న చర్చలకు పిలుపు

సామర్లకోట: మున్సిపాలిటీ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మె నాల్గవ రోజు గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు కార్యాలయ ఆవరణలోని సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులర్పించి తమ సమస్యలు పరిష్కారం అయ్యేలా మార్గం చూపాలని వేడుకున్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా చేస్తున్న నిరసనకు వాటర్ వర్క్స్ విశ్రాంత ఉద్యోగి సత్యనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు సంఘీభావం తెలిపారు. కుటుంబాన్ని పోషించుకునేలా తమ జీతాలు పెంచాలని దీక్షలు చేస్తున్నామని తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగ సంఘ అధ్యక్షుడు వీవీ రామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు. కాగా ఈనెల 18వ తేదీన ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ వర్కర్ల సమ్మెకు సంబంధించి చర్చలు జరపడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని రామరాజు గురువారం సాయంత్రం తెలిపారు. అత్యవసర విభాగానికి చెందిన కార్మికులు కావడంతో చర్చలు ఫలించే వరకు సగం మంది విధులకు హాజరవుతారని, మిగిలిన సగం మంది సమ్మెలో పాల్గొంటారని కార్మిక సంఘ అధ్యక్షుడు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు

- దుంప సాగులో మేలైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి
- తిరువనందపురం శాస్త్రవేత్త జగన్నాథం



కట్టమూరులో దుంప సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు జగన్నాథం, జానకి

పెద్దాపురం: మెట్ట రైతులు దుంప సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని తిరువనందపురం ఐసీఆర్ఏ సీటీసీఆర్ఏ శాస్త్రవేత్త డాక్టర్ డి.జగన్నాథం అన్నారు. మండలంలోని కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల్లో కర్ర పెండలం సాగును పెద్దాపురం దుంప పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎం.జానకి, డాక్టర్ ప్రకాష్‌లతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త జగన్నాథం మాట్లాడుతూ కర్ర పెండలం సాగు రైతులు ముందుగానే మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. తద్వారా దుంప సాగు రైతులకు మంచి లాభాలుంటాయన్నారు. వ్యవసాయ అధికారులు సూచించే యాజమాన్య పద్ధతులు పాటించి రైతులు కర్ర పెండలం సాగును చేపట్టాలన్నారు. అనంతరం గ్రామంలో రైతులు పండిస్తున్న విధానాన్ని అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు జానకి, ప్రకాష్ మాట్లాడుతూ దంప సాగులో మెళకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు విజయదుర్గ, అమృత, వర్షిని, మంగాజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడు



కృష్ణను అభినందిస్తున్న కోచ్ లక్ష్మణరావు

పిఠాపురం: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురానికి చెందిన పి.కృష్ణ ఎంపికైనట్టు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ నెల 12వ తేదీన రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీలలో పిఠాపురం సీబీఆర్ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ సెకండియర్ చదువుతున్న కృష్ణ ఇండియన్ రౌండ్ ఇండివిడ్యువల్ ఆర్చరీ ఈవెంట్లో రజిత పథకం సాధించాడని ఆయన తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి 27వ వరకూ ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటున్నట్లు కోచ్ తెలిపారు.

అరుణోదయ వేడుకలను

విజయవంతం చేయండి



అరుణోదయ వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వీరాంజనేయులు

పెద్దాపురం: తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) 50 వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. పులిమేరు దమ్ముపేటలో గురువారం రైతు కూలీలతో కలసి వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ నక్సల్బరీ వసంత మేఘగర్జనల వెలుగులో హైదరాబాద్‌లో పురుడు పోసుకున్న విప్లవ సాంస్కృతిక సంఘం అరుణోదయ (1974–2024) 50 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ప్రజా ఉద్యమాల చరితను తెలియజేస్తూ చేపట్టే సభల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం డివిజన్ నాయకులు దేశెట్టి సురేష్, తుంగపల్లి సూర్యనారాయణ, కోట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో సినిమాలు...

లలితా–1	: పుష్ప–2
లలితా–2	:పుష్ప–2
వీరభద్ర	:మిస్ యూ
శోభా	: ప్రణయ గోదావరి

సామర్లకోటలో.....:

జయలక్ష్మి –1	: పుష్ప–2
జయలక్ష్మి–2	:ప్రణయ గోదావరి:
విఘ్నేశ్వరా	: పుష్ప–2